

చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో షార్ట్ సర్క్యూట్

వార్డులో దట్టంగా వ్యాపించిన పొగ

భయంతో పరుగులు తీసిన రోగులు

-వార్త 8వ పేజీలో..

మత్స్యగుండం.. అభివృద్ధికి దూరం

- గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం
- భక్తులు, పర్యాటకుల అసంతృప్తి
- గ్రామాభివృద్ధి కమిటీ చొరవతో పలు పనులు
- కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే పర్యాటక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని పలువురి అభిప్రాయం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

పర్యాటక పుణ్యక్షేత్రంగా గుర్తింపు పొందిన మత్స్యగుండం కనీస అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో ఎంతో సుందరంగా ఉండే ఆ ప్రాంతం ప్రస్తుతం అధ్వానంగా దర్శనమిస్తోంది. పర్యాటకానికి వైసీపీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ఎటువంటి అభివృద్ధికి నోచక భక్తులు, సందర్శకులను ఆకర్షించలేని దుస్థితి కొనసాగుతోంది.



మత్స్యగుండంలో గెడ్డపై వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ లేని దృశ్యం

మత్స్యగుండం గురించి 2002 సంవత్సరం వరకు స్థానికులకు మినహా ఇతర ప్రాంతాలకు అంతగా తెలియని పరిస్థితి. ప్రతి ఏడాది మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ జాతర నేపథ్యంలో మత్స్యలింగేశ్వరుడ్ని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చేవారు. క్రమంగా ఆ తర్వాత నుంచి మత్స్యగుండంపై ముమ్మర ప్రచారం జరగడంతో ఇతర ప్రాంతాలకు నుంచి భక్తులు, పర్యాటకులు వచ్చేవారు. దీంతో పర్యాటక పరంగా మత్స్యగుండం ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని 2003లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రూ.కోటి వ్యయంతో మత్స్యకన్య, త్రిముఖశివుడు ప్రతిమలు, రెస్టారెంట్ భవనం, వ్యూపాయింట్, సుమారుగా రెండు ఎకరాల విస్తీర్ణంలో అనేక రకాల గులాబీలతో పార్కును అభివృద్ధి చేశారు. కానీ ఆ తరువాత అధికారులు దాని నిర్వహణ, బాగోగులు పట్టించుకోలేదు. దీంతో కొన్నాళ్లకే మత్స్యగుండం అధ్వానంగా మారింది.

ఆ తరువాత పుష్కరకాలానికి అంటే 2016లో వుడా (విశాఖ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)ఆధ్వర్యంలో మళ్లీ మత్స్యగుండం అభివృద్ధికి చర్యలు చేపట్టారు. సుమారు రూ.48 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ముఖ్యంగా మత్స్యగుండం నిర్వహణపై అటు దేవదాయ శాఖగాని, ఇటు పర్యాటకశాఖ గాని దృష్టి సారించిన దాఖలాలు లేవు. దీంతో ఎన్ని అభివృద్ధి పనులు చేసినా అక్కరకు రాని దుస్థితి కొనసాగుతున్నది.



మత్స్యగుండంలోని మత్స్యలింగేశ్వర ఆలయం

పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఎంతో మేలు

ప్రకృతి అందాలకు నిలయమైన గిరిజన ప్రాంతంలో పర్యాటకం పరంగా అభివృద్ధి చేస్తే ఎంతో కొంత ప్రయోజనం ఉంటుందని స్థానికులు, పర్యాటకులు అంటున్నారు. వాస్తవానికి మత్స్యగుండం వంటి ప్రాంతంలో అటు ఆధ్యాత్మికంగా, ఇటు పర్యాటకంగా భక్తులు, పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రధానంగా భక్తి పరంగా జరిగే కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు అనువుగా మందిరాలు, భక్తులు వంటలు, బస చేసేందుకు అనువుగా ఆశ్రమం తరహా నిర్మాణాలు చేపడితే, మత్స్యగెడ్డను ఆనుకుని ఉన్న ఈ ప్రాంతం చక్కగా అభివృద్ధి చెందుతుందని పలువురు అంటున్నారు.

అలాగే పర్యాటకులను ఆకట్టుకునేలా విజ్ఞాన, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతోపాటు సువిశాలమైన ప్రదేశంలో ఉన్న పార్కును అభివృద్ధి చేయడం, పర్యాటకులు బస చేసేందుకు అనువుగా చిన్న కాటేజీలు, భోజన సదుపాయానికి రెస్టారెంట్‌లు అందుబాటులోకి తీసుకువస్తే.. అరకులోయ నుంచి లంబసింగి వెళ్లే పర్యాటకులు పాడేరు ప్రాంతాన్ని సందర్శించి మత్స్యగుండంలో బస చేసేందుకు బాగుంటుందని సందర్శకులు చెబుతున్నారు. పర్యాటకంగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు ప్రత్యేక గుర్తింపుతోపాటు ఏజెన్సీకి మరింత మంది పర్యాటకుల్ని ఆకర్షించే అవకాశాలున్నాయి. ఆ దిశగా కూటమి ... మిగతా 8వ పేజీలో




నిరుపయోగంగా ఉన్న రెస్టారెంట్ భవనం

రాజ్‌మా సాగుకు ఇదే అదను

- నెలాఖరు నుంచి నాట్లుకు అనుకూలం
- 90 శాతం రాయితీపై వ్యవసాయ శాఖ ద్వారా విత్తనాలు

చింతపల్లి, ఆగస్టు 26:

జిల్లాలో ముందస్తు రబీ పంటగా రాజ్‌మా సాగుకు రైతులు సన్నద్ధం కావాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. అల్లూరి జిల్లాలో మాత్రమే ఆదివాసీ రైతులు రాజ్‌మాను సాగు చేస్తున్నారు. తొలి రోజుల్లో పాడేరు, రంపచోడవరం ఐటీడీఏల పరిధిలో 20 వేల హెక్టార్లలో రాజ్‌మాను సాగు చేసేవారు. కాలక్రమేణా ప్రతికూల వాతావరణ పరిస్థితులు, నాణ్యమైన విత్తనం కొరత కారణంగా సాగు విస్తీర్ణం పడిపోయింది. ప్రస్తుతం పాడేరు డివిజన్ పరిధిలో 10,531 హెక్టార్లలో రైతులు రాజ్‌మాను సాగు చేస్తున్నారు. రాజ్‌మాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో అత్యధిక గిరాకీ వుంది. రాజ్‌మాలో పోషక విలువలు పుష్కలంగా వుండడంతో జిల్లాలో పండించిన రాజ్‌మాలు 60 శాతం ఉత్తర భారతదేశానికి ఎగుమతి అవుతున్నాయి. కిలో రాజ్‌మా రూ.60 నుంచి రూ.80 ధర లభిస్తున్నది.



రాజ్‌మా చింతపల్లి రెడ్ విత్తనాలు



రాజ్‌మా చింతపల్లి వైట్ విత్తనాలు

రాయితీపై విత్తనాలు..

ఆదివాసీ రైతులకు 90 శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్నది. తొలిసారిగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆగస్టులోనే ఏపీసీడ్స్ నుంచి విత్తనాలను ఆర్‌బీకేలకు తరలించింది. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం సెప్టెంబరు చివరిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేసేవారు. దీంతో విత్తనాల కోసం రైతులు నిరీక్షించాల్సి వచ్చేది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు రెండో వారంలోనే విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. పాడేరు డివిజన్ పరిధిలో 11మండలాలు, రంపచోడవరం డివిజన్‌లో వైరామవరం మండలాలకు 4,500 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది.



రాజ్‌మా సాగు (ఫైల్ ఫొటో)

విత్తన రకాలు..

వ్యవసాయశాఖ ఏపీ సీడ్స్ ద్వారా చింతపల్లి రెడ్, చింతపల్లి వైట్ రకాల విత్తనాలను పంపిణీ చేస్తున్నది. చింతపల్లి రెడ్ రకం 90 నుంచి 95 రోజుల పంట, హెక్టారుకు 15 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. చింతపల్లి వైట్ 80 నుంచి 85 రోజుల పంట, హెక్టారుకు 12 నుంచి 14క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

నాట్లు, విత్తన మోతాదు

రాజ్‌మాను ఆగస్టు నెలాఖరు నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు నాట్లు వేసుకోవచ్చు. నీటి సౌకర్యం వుంటే జనవరిలోనూ నాట్లు వేసుకోవచ్చు.ఎకరాకు 20 కిలోల విత్తనం అవసరం. విత్తనం వేయడానికి నేలను బాగా దున్ని చక్కని పదును చేసుకోవాలి. విత్తేటప్పుడు వరుసలలో 30 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు దూరాన్ని ... మిగతా 8వ పేజీలో

ఏయూ రెక్టార్‌గా ప్రొఫెసర్ కిశోర్‌బాబు

- రిజిస్ట్రార్‌గా ధనుంజయరావు
- డీన్లుగా మరికొందరు ఆచార్యులు



ఎస్.కిశోర్‌బాబు



ధనుంజయరావు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆచార్య ఎస్.కిశోర్‌బాబు రెక్టార్‌గా నియమితులయ్యారు. రిజిస్ట్రార్‌గా జియాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్, గత పాలకుల హయాంలో ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డీన్‌గా పనిచేసిన ఇఎస్.ధనుంజయరావును నియమించారు. ఈ మేరకు ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అకడమిక్ అఫైర్స్ డీన్‌గా ఆచార్య కె.ఈశ్వరకుమార్‌ను, ఇంటర్నేషనల్ అఫైర్స్ డీన్‌గా ఆచార్య చల్లా రామకృష్ణను, సీడీసీ డీన్‌గా ఆచార్య టీవీ కృష్ణను, స్టూడెంట్ అఫైర్స్ ఇన్‌చార్జి డీన్‌గా డాక్టర్ జి. రాంబాబును, అసోసియేట్ డీన్లుగా ఎన్.ఎం.యుగంధర్, ఎస్.హరనాథ్, ఏఈఆర్‌సీ గౌరవ డైరెక్టర్‌గా ఆచార్య లిల్లీ గ్రేస్‌ను, కంప్యూటర్ సెంటర్ అసోసియేట్ డీన్‌గా డాక్టర్ కె. వెంకటరమణను, గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా డి. రామారావును, ఐఎఎస్ఈ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డి.నాగరాజకుమారిని నియమించారు. ఇదిలావుండగా రిజిస్ట్రార్‌గా ఆచార్య ధనుంజయరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

సోప్ యూనిట్ తెరుచుకునేనా?

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మూసివేత
- ఈ నెల 7న యూనిట్‌ను సందర్శించిన జీసీసీ ఎండీ
- పది రోజుల్లో తెరవాలని ఆదేశం
- ఇరవై రోజులైనా తెరుచుకోని వైనం



అరకులోయలోని సోప్ యూనిట్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జీసీసీ ఎండీ కల్పనాకుమారి, పక్కనే ఐటీడీఏ పీవో అభిషేక్ (ఫైల్ ఫొటో)

అరకులోయ, ఆగస్టు 26:

అరకులోయలోని సబ్బుల తయారీ యూనిట్‌ను పది రోజుల్లో తెరవాలని స్వయంగా జీసీసీ ఎండీ ఆదేశించినా ఇప్పటి వరకు తెరుచుకోలేదు. ఇటీవలే జీసీసీ ఎండీగా బాధ్యతలు చేపట్టిన కల్పనాకుమారి ఐటీడీఏ పీవోతో కలిసి పాడేరు, అరకులోయల్లో ఈ నెల 7న పర్యటించారు. ఈ సందర్భంగా అరకు జీసీసీ బ్రాంచి ఆఫీసును సందర్శించారు. ఆఫీస్ ప్రాంగణంలోనే మూతబడిన సోప్ యూనిట్‌పై ఆరా తీశారు. సోప్ యూనిట్ మూతబడిన విషయం తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని సోప్ యూనిట్ మేనేజర్, జీసీసీ డీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పది రోజుల్లోగా తెరవాలని ఆదేశించారు. అయితే ఇప్పటికి 20 రోజులు అవుతున్నా ఎటువంటి పురోగతి లేదు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మూసివేత

గిరిజన సహకార సంస్థ 2008వ సంవత్సరంలో అరకులోయలో సోప్ యూనిట్‌ను (సబ్బుల తయారీ కేంద్రం) ఏర్పాటు చేసింది. నెలకు లక్ష సబ్బులు ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. ఇక్కడ తయారు చేసిన సబ్బులను రాష్ట్రంలో (ఉమ్మడి ఏపీ) ఉన్న అన్ని గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలకు సరఫరా చేసేవారు. డ్వామా అధికారులు ఉపాధి హామీ పథకం కూలీల కోసం సబ్బులు కొనుగోలు చేసేవారు. ఇంకా జీసీసీ డీఆర్ డిపోలకు కూడా సబ్బులు సరఫరా అయ్యేవి. దీంతో 2012లో సోప్ యూనిట్‌ను విస్తరించి నెలవారీ ఉత్పత్తి సామర్థ్యాన్ని రెండు లక్షల సబ్బులకు, 2020లో మూడు లక్షల సబ్బుల తయారీకి పెంచారు. నీమ్ (వేప), అలోవేరా (కలబంద), టర్మరిక్ (పసుపు), జాస్మిన్ (మల్లె) రకం సబ్బులు తయారు చేసేవారు. కాగా 2020 మార్చిలో కొవిడ్-19 ప్రబలడంతో గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలను నెలల తరబడి మూసివేశారు.

అదే ఏడాది గత వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ప్రారంభించింది. నేరుగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయడంతో గిరిజన సంక్షేమ శాఖకు చెల్లించే కాస్మొటిక్స్ చార్జీలను ప్రభుత్వం నిలిపివేసింది. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సోప్ యూనిట్ నుంచి సబ్బుల కొనుగోళ్లను ఆపేశారు. ఈ ప్రభావం సోప్ యూనిట్‌పై పడడంతో ఉత్పత్తిని బాగా తగ్గించేశారు. ఇదే సమయంలో డ్వామా నుంచి కూడా కొనుగోళ్లు ఆగిపోయాయి. సోప్ యూనిట్‌లో గత నవంబరు నుంచి సబ్బుల తయారీ నిలిచిపోయింది. ఫలితంగా 21 మంది సోప్ యూనిట్ కార్మికులకు పనిలేకుండా పోయింది. వీరిని పలు మండలాల్లో ఉన్న బ్రాంచీ కార్యాలయాల్లో, డీఆర్ డిపోలలో, అరకులోయ బ్రాంచి కార్యాలయంలో కాఫీ గింజల గ్రేడింగ్ పనులకు వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి సోప్ యూనిట్‌ను తెరిపించాలని కార్మికులు కోరుతున్నారు.

బీఎస్ఎన్ఎల్ జోష్



- ప్రైవేటు ఆపరేటర్లు టారిఫ్‌లు పెంచడంతో ప్రభుత్వ రంగ సంస్థ వైపు వినియోగదారుల చూపు
- ఉమ్మడి జిల్లాలో గత నెల కొత్తగా 18,800 మంది కస్టమర్లు చేరిక
- అందులో 12,000 మంది ప్రైవేటు కంపెనీల వినియోగదారులే...
- ప్రస్తుతం ప్రీ, పోస్ట్‌పెయిడ్ వినియోగదారులు 4.3 లక్షల మంది
- మరిన్ని 4జి టవర్లు ఏర్పాటు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

బీఎస్ఎన్ఎల్...ఒకప్పుడు ఒక వెలుగువెలిగి, గత కొన్నాళ్లుగా ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ. ఇప్పుడు కాస్త నిలదొక్కుకునేందుకు యత్నిస్తోంది. ఇటీవల ప్రైవేటు టెలికాం కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియాలు ఇష్టానుసారంగా టారిఫ్‌లు పెంచేశాయి. దీంతో గత నెల రోజులుగా ఆయా సంస్థల వినియోగదారులు లక్షలాది మంది బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లోకి మారిపోతున్నారు. ఒక్క జూలై నెలలోనే రాష్ట్రవ్యాప్తంగా 2.2 లక్షల మంది బీఎస్ఎన్ఎల్ కనెక్షన్ తీసుకోగా, వీరిలో 1.4 లక్షల మంది జియో, ఎయిర్‌టెల్, వీఐ నుంచి మొబైల్ నంబర్ పోర్టబులిటీ (ఎంఎన్‌పీ) పొందిన వారు ఉన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ ఈ సంఖ్య భారీగా ఉందని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ ఎన్ఎల్) అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో జూలై నెలలో 18,800 వేల మంది కొత్తగా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లో చేరగా, వీరిలో ఎంఎన్‌పీ ద్వారా ఇతర టెలికాం సంస్థల నుంచి వచ్చినవారు 12 వేల మంది వరకూ ఉన్నారు. ఈ నెలలో మొదటి పది రోజుల్లోనే సుమారు నాలుగు వేల మందికిపైగా కొత్తగా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లోకి వచ్చారు. వీరిలో మూడు వేల మంది ఇతర టెలికాం సంస్థల నుంచి మారినవాళ్లే.

భారీగా పెరిగిన ధరలు

గతంలో జియో రోజుకు 1 జీబీ సామర్థ్యం, 28 రోజుల వ్యాలిడిటీ ప్యాకేజీ రూ.199 ఉండగా, ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.250కి పెంచింది. 1.5 జీబీ సామర్థ్యం, 28 రోజులు వ్యాలిడిటీ ప్లాన్‌ను రూ.239 నుంచి రూ.299కు, 2 జీబీ సామర్థ్యం, 28 రోజులు వ్యాలిడిటీ కలిగిన ప్లాన్‌ను రూ.299 నుంచి రూ.349కు పెంచింది. జియోతోపాటు ఇతర టెలికాం సంస్థలు భారీగా టారిఫ్‌లు పెంచాయి.

కొత్తగా 800 4జి టవర్లు

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌కు 420 టవర్లు ఉన్నాయి. వీటిని 4జి టవర్లుగా అప్‌గ్రేడ్ చేయిస్తున్నారు. ఇప్పటివరకూ 28 టవర్లను అప్‌గ్రేడ్ చేశారు. అలాగే ప్రాజెక్టు 4జి శాచ్యురేషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 800 వరకూ 4జి టవర్లు ఏర్పాటు చేయబోతున్నారు. ఇప్పటికే 50 టవర్లు ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. డిసెంబరు నాటికి మొత్తం టవర్లు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులు సాగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. ప్రతి గ్రామానికి హైస్పీడ్ ఇంటర్‌నెట్ సదుపాయాన్ని కల్పించడమే లక్ష్యంగా బీఎస్ఎన్ఎల్ 4జి టవర్లను దేశవ్యాప్తంగా ఏర్పాటుచేస్తోంది. జిల్లాలో ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌కు ప్రీ, పోస్టు పెయిడ్ వినియోగదారులు 4.3 లక్షల మంది ఉన్నారు. వీరిలో 30 వేల మంది పోస్ట్ పెయిడ్ వినియోగదారులు కాగా, మిగిలిన నాలుగు లక్షల మంది ప్రీ పెయిడ్ వినియోగదారులు. రానున్న రెండు, మూడు నెలల్లో వినియోగదారుల సంఖ్య ఐదు లక్షలు దాటే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అతిసార బాధితులకు సత్వర వైద్యం

- ఏడుగురు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలింపు
- కలెక్టర్ చొరవతో తాటిబందలో వైద్య శిబిరం ఏర్పాటు

చింతపల్లి, ఆగస్టు 26: మండలంలోని అంజలి శనివారం పంచాయతీ తాటిబంద గ్రామంలో అతిసార బాధితులు కోలుకుంటున్నారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న ఏడుగురు బాధితులను అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో ఉన్న మరో ఎనిమిది మందికి తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది వైద్యసేవలందిస్తున్నారు.

అంజలి శనివారం గ్రామంలో అతిసార ప్రబలడంతో ఆదివారం స్థానిక యువత ఫోన్ ద్వారా జిల్లా కలెక్టర్‌కి సమాచారం అందజేసిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ గ్రామంలో ఉన్న అతిసార బాధితులకు మెరుగైన చికిత్స అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్ టి.రామకృష్ణను ఆదేశించారు. తహసీల్దార్.. తాజంగి వైద్యాధికారి భవానితో మాట్లాడి వైద్య సిబ్బంది, అంబులెన్స్‌ను రాత్రి 11 గంటలకు గ్రామానికి పంపించారు. గ్రామంలో తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న వంతల నాగమణి, పి.చిన్ని, వంతల అంజలి, కొర్ర ఆసు, మర్రి రోజ, గెమ్మెలి చిన్ని, మూడేళ్ల బాలుడు వంతల దేవదాసులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. దేవదాసు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో నర్సీపట్నం వైద్యులు కేజీహెచ్‌కి తరలించారు. సోమవారం ఉదయం తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది గ్రామాన్ని ... మిగతా 8వ పేజీలో



ఆదివారం రాత్రి అంబులెన్సులో రోగులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న వైద్యసిబ్బంది



సోమవారం అతిసార బాధితులకు సెలైన్ పెడుతున్న తాజంగి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

క్రైం... crime news

వరహా నదిలో గల్లంతైన కూలి మృతి



వరహా నదిలో బంగారయ్య మృతదేహం వెలికితీసిన దృశ్యం

కోటవురట్ల, ఆగస్టు 26 : మండలంలోని పందూరు వద్ద గల వరహా నదిలో గల్లంతైన కూలి మృతదేహం లభ్యమైంది. కొత్తగొట్టివాడ గ్రామానికి చెందిన సుంకర బంగారయ్య, అలి యాస్ పోతురాజు (55) ఆదివారం ఉదయం స్వగ్రామం నుంచి పందూరులో సరుగుడు తోట నరికేందుకు కూలి పని నిమిత్తం సైకిల్‌పై బయల్దేరాడు. రామచంద్రపురం జంక్షన్ మీదుగా పందూరు వరహా నదిపై ఉన్న వంతెన వద్దకు చేరుకున్నాడు. అక్కడి నుంచి సైకిల్‌ను భూజంపై మోసుకుంటూ నది దాటే క్రమంలో నీటి ఉధృతికి సైకిల్‌తో సహా కొట్టుకుపోయాడు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు చూసి కేకలు వేశారు. ఈ విషయాన్ని పందూరు గ్రామస్థులు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. దీంతో అతని ఆచూకీ కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నదిలో ఆదివారం, సోమవారం గాలించగా ఉదయం పది గంటలకు నదిలో మృతదేహం బయటపడింది. ఇది చూసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బంగారయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటవురట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

లీగల్ ఒపీనియన్‌కు నకిలీ హారం కేసు

నర్సీపట్నం, ఆగస్టు 26 : శ్రీమహాలక్ష్మి అమ్మవారి బంగారం ఆభరణాలలో వెలుగు చూసిన నకిలీ హారం కేసు పట్టణ పోలీసులు లీగల్ ఒపీనియన్‌కి పంపించారు. ఈవో గంగారావు, ఇన్‌చార్జి ఈవో దివ్యజ్యోతి ఒకరి మీద ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీని మీద లీగల్ ఒపీనియన్ తీసుకున్న తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని పోలీసులు తెలిపారు.

'పాత పెన్షన్ విధానం అమలుకు పోరాడాలి'



సదస్సులో మాట్లాడుతున్న వక్త

విశాఖపట్నం, ఆగస్టు 26 : పాత పెన్షన్ విధానానికి మోదీ మంత్రివర్గం ఆమోదించిన ఏకీకృత పెన్షన్ విధానం ప్రత్యామ్నాయం కాదని, దీనిని అందరూ వ్యతిరేకించాలని సీఐటీయూ అఖిల భారత కార్యదర్శి కేఎస్ ఉమేష్ పిలుపునిచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో 'ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటు - ఓపీఎస్ సాధన- కార్మికవర్గ పాత్రపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏకీకృతపెన్షన్ విధానంపై దేశంలోనే మొదటిసారిగా సదస్సు నిర్వహించిన విశాఖపట్నం డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీని అభినందిస్తున్నామన్నారు. రాష్ట్రాలలో త్వరలో జరగబోతున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని లబ్ధి పొందడం కోసమే ఏకీకృత పెన్షన్ విధానాన్ని కేంద్రం ప్రకటించిందని తెలిపారు. ఎనిమిదో వేతన సంఘాన్ని తక్షణమే ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటీకరణకు, ప్రైవేటీకరణకు, కార్మిక కోడ్స్ పేరుతో కార్మిక చట్టాల మార్పునకు వ్యతిరేకంగా కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. ఏఐడీఈఎఫ్ మాజీ అదనపు కార్యదర్శి గుహతకుర్తా మాట్లాడుతూ పెన్షన్ భిక్ష కాదని, కార్మికుల హక్కుని సుప్రీంకోర్టు విశదీకరించిందన్నారు. సదస్సుకు డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఐదేళ్ల పదవుల్లో ఉండే ఎంపీలు పెన్షన్ తీసుకుంటారన్నారు. ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ డివిజన్ కార్యదర్శి బోలేనాథ్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు,కాన్ఫడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ కార్యదర్శి పి.నాగేశ్వరరావు, టీఎస్‌టీయూసీ ప్రధానకార్యదర్శి కె.నాగార్జున, నావెల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో ఆర్మీ ర్యాలీ

▸▸ భారీ వర్షంతో వేదికను మార్చిన అధికారులు



బీచ్‌రోడ్డులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అభ్యర్థులు

విశాఖపట్నం, ఆగస్టు 26 : ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని సోమవారం తెల్లవారుజామున సాగరతీరంలో నిర్వహించారు. విశాఖ నగరంలోని పోర్టు స్టేడియంలో ఈ ర్యాలీ సోమవారం అర్ధరాత్రి ప్రారంభమయింది. ఇందుకోసం స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. అయితే అర్ధరాత్రి దాటిన తరువాత ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో మైదానం, రన్నింగ్ ట్రాక్ మొత్తంబురదమయమైపోయింది. అభ్యర్థులు బురదలోజారిపోయి గాయాలపాలవుతారని భావించినఅధికారులు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచనతో ర్యాలీని బీచ్‌రోడ్డుకు మార్పు చేశారు. దీంతో తెల్లవారుజామున ర్యాలీ తీరంలో ప్రారంభమయింది. ఓ వైపు భారీ వర్షం కురుస్తున్నప్పటికీ అభ్యర్థులు లెక్కచేయకుండా ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.



టార్గెట్ చేరుకుంటున్న అభ్యర్థి

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	93.00
లైవ్ ధర	113.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

పారిశ్రామికవాడ.. రోడ్లు చూస్తే దడ..

▸▸ అస్తవ్యస్తంగా మారిన ఏపీఐఐసీ ప్రధాన రహదారి
▸▸ రోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు
▸▸ పట్టించుకోని అధికారులు
▸▸ అవస్థలు పడుతున్న జనం

అచ్యుతాపురం, ఆగస్టు 26 : ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి రహదారుల దుస్థితి దర్పణంగా నిలుస్తోంది. ఏ ప్రాంతంలో చూసినా గతుకులమయం కాగా, కొన్నిచోట్ల రాళ్లు తేలి దర్శనమిస్తున్నాయి. ఫలితంగా రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడి ఏపీఐఐసీ ప్రధాన రహదారి దుస్థితి మరీ దారుణంగా ఉంది. అచ్యుతాపురం జంక్షన్ నుంచి పూడిమడక వరకు సుమారు తొమ్మిది కిలోమీటర్ల రోడ్డు ఏపీఐఐసీ ఆధీనంలో ఉంది. ఈ రోడ్డు మరమ్మతులకు నోచుకోక పోవడంతో బాగా పాడైపోయింది. సెజ్‌లో కర్మాగారాలు ఏర్పాటు చేసిన తర్వాత ఈ రోడ్డును ఏపీఐఐసీ నాలుగు రోడ్లుగా విస్తరించింది. కర్మాగారాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులను తీసుకు వెళ్లే బస్సులతో పాటు యంత్ర సామగ్రి, విడి భాగాలు తీసుకు వెళ్లే భారీ నుంచి అతి భారీ వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు ఈ రోడ్డు గుండానే సాగిస్తుంటాయి. అయినప్పటికీ ఈ రోడ్డును ఏపీఐఐసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డులో దుప్పితూరు వద్ద ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయం ఉంది. ఆ ముందు రోడ్డే గుంతలు పడి పాడైపోయింది.



పూడిమడక వద్ద రోడ్డు మధ్యలో గోతులు



ఏపీఐఐసీ కార్యాలయం ముందు జంక్షన్ వద్ద దుస్థితి

ఇక ఏపీఐఐసీ అధికారులు అచ్యుతాపురం జంక్షన్ మీదుగా ఇదే రోడ్డులో వెళ్లి వస్తుంటారు. అయినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఇదిలావుంటే, పూడిమడక ఉన్నత పాఠశాల పక్కన ఏపీఐఐసీ రోడ్డును ఆనుకొని నీటి పైప్‌లైన్ కోసం పెద్ద గొయ్యిని నెల రోజుల క్రితం తవ్వి వదిలేశారు. ఇక్కడ ఉన్న డబుల్ రోడ్డులో ఒక రోడ్డు మధ్యలో గోతులు పడగా, మరో రోడ్డు పక్క పైప్‌లైన్ కోసం తవ్విన పెద్ద గుంత భయపెడుతోంది. పూడిమడక ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఈ గుంతను దాటుకొని వెళ్లాలి. అలాగే పూడిమడక-లోవపాలెం రోడ్డులో గల సన్విరా కర్మాగారం నుంచి పొడవైన భారీ ట్రాలర్లు ఈ గుంతను తప్పించుకొని వెళ్లాలి. పూడిమడక- లోవపాలెం జంక్షన్ మలుపులో ఈ గుంత ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు హడలిపోతున్నారు. ఈ రోడ్డు దుస్థితి ఇంత దారుణంగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ఒక్క అచ్యుతాపురం జంక్షన్ అభివృద్ధి చేస్తే చాలదని, కర్మాగారాలకు వెళ్లే రోడ్లను కూడా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



పూడిమడక ఉన్నత పాఠశాల వద్ద రోడ్డు పక్కన భారీ గొయ్యి

ఓపీఎస్ మాత్రమే అమలు చేయాలి

▸▸ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్

పాయకరావుపేట, ఆగస్టు 26 : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్, సీపీఎస్ కాకుండా పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం పాయకరావుపేటలో జరిగిన నియోజకవర్గ స్థాయి పీఆర్‌టీయూ సమావేశంలో మాట్లాడారు. 117 జీవోను రద్దుచేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని, వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై ప్రభుత్వం పునరాలోచన చేసి ఎన్‌రోల్‌మెంట్ ఆగస్టు తొమ్మిదో తేదీ కాకుండా ఆగస్టు 16వ తేదీన మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రతి ప్రాథమిక పాఠశాలలో రోల్‌తో సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. 12వ పే రివిజన్ కమిషన్‌ను నియమించి తక్షణమే ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. అదేవిధంగా ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియానికి సమాంతరంగా తెలుగు మీడియాన్ని ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల అధ్యక్షులు ఎ.ప్రకాష్, ఆర్.వీరభద్రరావు, టి.వెంకటరమణతో పాటు నాయకులు టి.సత్యనారాయణ, బాషా తదితరులు పాల్గొన్నారు.

పాత వారికే పట్టం!

▸▸ ఏయూలో మాజీ వీసీ ప్రసాదరెడ్డి వర్గానికే కీలక పదవులు
▸▸ తెలిసి చేస్తున్నారా?, తెలియక చేస్తున్నారా??
▸▸ కూటమి మద్దతుదారుల్లో ఆందోళన
▸▸ ఇలాగైతే మాజీ వీసీపై విచారణ చేపట్టినా ఫలితం ఉండదనే అభిప్రాయాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కీలక పోస్టుల విషయంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆ పార్టీ సానుభూతిపరులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వైసీపీ పాలనలో వీసీగా వ్యవహరించిన ప్రొఫెసర్ ప్రసాదరెడ్డి యూనివర్సిటీని పార్టీ కార్యాలయంగా మార్చేసిన సంగతి తెలిసిందే. పార్టీకి ఉపయోగపడే వారికే కీలక పదవులు ఇచ్చుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. ప్రసాదరెడ్డి చేసిన అడ్డగోలు వ్యవహారాలపై కమిటీ వేసి విచారణ చేయాలనే డిమాండ్ ఉంది. దీనిని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈలోగా కీలక పదవులను భర్తీచేస్తోంది. అయితే ప్రసాదరెడ్డి ద్వారా గతంలో ప్రయోజనం పొంది...కీలక స్థానాల్లో ఉన్నవారికే ఈ ప్రభుత్వం కూడా పెద్దపీట వేస్తోంది. దీనిని కూటమి మద్దతుదారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రసాదరెడ్డి వెళ్లిపోతూ అకడమిక్స్ అఫైర్స్ డీన్‌గా ఉన్న కిశోర్‌బాబును ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఇప్పుడు ఆయనకు కూటమి ప్రభుత్వం రెక్టార్ పదవి కట్టబెట్టింది. ఇది వర్సిటీలో చాలా కీలకమైన పదవి. అకడమిక్ వ్యవహారాలన్నీ రెక్టారే చూస్తారు. అలాగే ఇంటర్నేషనల్ అఫైర్స్ డీన్‌గా ధనుంజయ్‌రావును ప్రసాదరెడ్డి నియమించుకున్నారు. తాజాగా వైస్ చాన్సలర్ పోస్టు ఖాళీ అయినప్పుడు దాని కోసం ధనుంజయ్‌రావు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు ఆయన్ను కూటమి పెద్దలు రిజిస్ట్రార్‌గా నియమించారు. రెక్టార్, రిజిస్ట్రార్ రెండూ కీలక పదవులు. ఇవి ప్రసాదరెడ్డి బృందానికే దక్కడంతో యూనివర్సిటీలో ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. రేపు ఆయనపై విచారణ చేస్తే కీలక పదవుల్లో ఉన్న వీరు దానిని ప్రభావితం చేయకుండా ఉంటారని ఎలా నమ్ముతారని ప్రశ్నిస్తున్నారు. ఏయూకు సంబంధించిన నియామకాల్లో అమరావతి పెద్దలు విశాఖ జిల్లా నాయకులను సంప్రతించడం లేదని, అందుకే ఇలాంటి నిర్ణయాలు వెలువడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కింది నుంచి పైవరకూ ఒక సామాజికవర్గం వారికే పదవులు ఇచ్చుకొన్నారు. ఇప్పుడు సామాజిక వర్గాలను పక్కన పెట్టినా ఆ బృందానికే పదవులు ఇవ్వడం ఏమిటనే చర్చ జరుగుతోంది.

నవంబరు 27న ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 26: శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నవంబరు 27 నుంచి ఇంటర్నేషనల్ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. టోర్నీ పోస్టర్‌ను సోమవారం విశాఖ పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలోని జీవీఎంసీ ఎస్-3 స్పోర్ట్సు ఎరీనా వేదికగా ఆరు రోజులపాటు జరిగే టోర్నీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆలిండియా చెస్ సమాఖ్య, ఏపీ చెస్ సంఘం, విశాఖ శాఖ సంఘం పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయని, వివిధ ప్రాంతాల రేటింగ్ క్రీడాకారులు పాల్గొనే ఈ టోర్నీలో విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని ఆల్ విశాఖ చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రంగాల బాబూరావు వివరించారు. చెస్ సంఘం ప్రతినిధులు ఏ.సురేష్, ఎస్.మణికంఠరావు, డాక్టర్ రామానుజస్వామి పాల్గొన్నారు.

ఆంగ్లంలోనే పరీక్షలు

▸▸ నేటి నుంచి ప్రారంభం
▸▸ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇబ్బందే...
▸▸ మండల కేంద్రాల నుంచి ప్రశ్నపత్రాల పంపిణీ
▸▸ దశల వారీగా తెలుగు మాధ్యమం ఎత్తేసిన గత వైసీపీ ప్రభుత్వం

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుమారు 80 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నుంచి స్వీయ మదింపు పరీక్షలు (సెల్ఫ్ అసెస్‌మెంట్ టెస్ట్/ఫస్ట్ యూనిట్ టెస్ట్) ప్రారంభం కానున్నాయి. అయితే పాఠశాల విద్యా శాఖ చరిత్రలో తొలిసారిగా పరీక్షలు ఆంగ్లంలోనే జరగనున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో బోధన మొత్తం ఆంగ్లంలోనే నిర్వహిస్తున్నారు. అందుకే పరీక్షలు కూడా ఆంగ్లంలోనే రాయాలని విద్యార్థులకు సూచించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007-08లో ఆంగ్ల మాధ్యమం ప్రారంభించారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో సెక్షన్లు ఉండేవి. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ బడుల్లో దశలవారీగా తెలుగు మాధ్యమం ఎత్తివేసేలా ప్రణాళిక అమలుచేసింది. 2024-25 సంవత్సరం నుంచి పూర్తిగా ఆంగ్లంలో బోధన, పరీక్షలు నిర్వహించేలా నిర్దేశించింది. దీనిపై భాషావేత్తలు, ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చినా పట్టించుకోలేదు. అదే సమయంలో ఆంగ్ల మాధ్యమంలో బోధన, పరీక్షలకు పిల్లలను సన్నద్ధం చేయడంలో విఫలమైంది. గ్రామీణ ప్రాంతంలో ఎక్కువ మంది విద్యార్థులకు ఆంగ్లంలో బోధిస్తే అర్థం కాదు..ఇక ఆంగ్లంలో పరీక్షలు రాయడం అంటే మరింత ఇబ్బందికరమనే వాదన ఉంది. ప్రస్తుత ఏడాది విద్యార్థులకు ఇచ్చిన పాఠ్యపుస్తకాలు ద్విభాష (ఇంగ్లీష్, తెలుగు)లో ముద్రించారు. తరగతి గదుల్లో ప్రధానంగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మాతృభాషలోనే బోధన చేస్తున్నారు. చివరకు ఉన్నత పాఠశాలల్లో ఎక్కువమంది పిల్లలకు తెలుగు మీడియంలో బోధన చేస్తేనే అర్థమవుతుందని తెలిసినా ఎవరూ ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం లేదు. విచిత్రమేమిటంటే...ఒరియా, ఉర్దూ మాధ్యమంలో చదువుకునే పిల్లలు ఆయా భాషల్లో పరీక్షలు రాసుకునే వెసులుబాటు ఉంది. కానీ తెలుగు మాట్లాడే మన పిల్లలకు మాతృభాషలో పరీక్షలు రాసుకునే అవకాశం ఇవ్వడం లేదు. దీనిపై ఉపాధ్యాయుల్లో అసంతృప్తిలో ఉన్నా ఎవరూ బయటకు చెప్పడం లేదు.

నేటి నుంచి పరీక్షలు...

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నుంచి వచ్చే నెల నాలుగో తేదీ నుంచి స్వీయ మదింపు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి ప్రతిరోజు ప్రశ్నపత్రాలు పంపిస్తారు. తొలిరోజు మంగళవారం సింహాచలంలో ఓరియంటల్ పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు.

ఈ నెల 28 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు, 28వ తేదీ నుంచి వచ్చే నెల నాలుగోతేదీ నుంచి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ప్రశ్నపత్రాలు లీకేజీకి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సంబంధిత యాజమాన్యాలు నిర్వహిస్తాయి.

'సినర్జిన్ ఫార్మా'లో మృతుని కుటుంబానికి పరిహారం

▸▸ రూ.కోటి చెక్కును అందజేసిన డీటీ



మృతుని కుటుంబానికి చెక్కు అందిస్తున్న డీటీ శాంతిభూషణం

పరవాడ, ఆగస్టు 26 : ఇక్కడి ఫార్మాసిటీలోని సినర్జిన్ ఫార్మా యూనిట్-3లో జరిగిన ప్రమాదంలో గాయపడి మృతి చెందిన కెమిస్ట్ కోరాడ సూర్యనారాయణ కుటుంబానికి అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు నష్టపరిహారాన్ని ప్రకటించారు. ఈ మేరకు కోటి రూపాయల చెక్కును పరవాడ డిప్యూటీ తహసీల్దార్ శాంతిభూషణం చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు సోమవారం విశాఖ కేజీహెచ్ వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, గనిశెట్టి సత్యనారాయణ, కె.చంద్రశేఖర్, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఆర్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి రెండో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, ఆగస్టు 26 : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ) లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆదివారం రాత్రి ఉత్పత్తి అర్ధంతరంగా నిలిచిపోయింది. దీంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పనులు ప్రారంభించారు. మంగళవారం నాటికి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇదిలావుంటే మిగతా ఒకటి, మూడు, నాలుగు యూనిట్‌లలో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

29న తుమ్మపాలలో ఖోఖో జిల్లా జట్ల ఎంపిక

అనకాపల్లి టౌన్, ఆగస్టు 26 : ఆంధ్రప్రదేశ్ 34వ అంతర్ జిల్లాల సబ్ జూనియర్స్ ఖోఖో పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక ఈనెల 29న అనకాపల్లి మండలం తుమ్మపాల క్రీడా మైదానంలో జరగనుందని జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి జయవీర్, సీహెచ్.ఎల్.ఎన్. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈ ఎంపిక జరుగుతుందని వివరించారు. వచ్చే నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రకాశం జిల్లా జె.పంగులూరులో జరిగే పోటీల్లో ఎంపికైన వారు తలపడనున్నారని పేర్కొన్నారు.

ఉధృతంగా సర్పానది ప్రవాహం



పరవళ్లు తొక్కుతున్న సర్పానది

మాకవరపాలెం, ఆగస్టు 26: మండలంలో సర్పానది సోమవారం ఉదయం నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో సర్పానదిలో నీటి ప్రవాహం పెరిగింది. అయితే పీపీ అగ్రహారం వద్ద జలపాతం తరహాలో ఇక్కడ నీటి ప్రభావం కనబరచడంతో స్థానికులు చూసేందుకు పోటీపడుతున్నారు.

నేడు అప్పన్న ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

▸▸ సాయంత్రం 6 గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం, ఆగస్టు 26: వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇందులో భాగంగా ఉత్సవం రాత్రి ఆరాధనల తరువాత సుమారు 8 గంటల సమయంలో ఆలయ బేడామండపంలోని ప్రత్యేక పాలరాతి సింహాసనంపై జనన ఘట్టాన్ని ఆవిష్కరించటం ఆచారంగా వస్తోంది. ఉత్సవాన్ని పురస్కరించుకుని సాయంత్రం 6 గంటల వరకు అప్పన్నస్వామి దర్శనాలు భక్తులకు లభిస్తాయి. అలాగే మధ్యాహ్నం 11.30 గంటల నుంచి గంట పాటు ఉండాల్సిన రాజభోగం నివేదన బ్రేక్ ఉండదు. దీంతో ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు స్వామివారి దర్శనాలు భక్తులకు నిర్విరామంగా లభిస్తాయి. రాత్రి ఆరాధన టికెట్ల విక్రయాలు రద్దు చేశారు. ఈ నెల 28 సాయంత్రం 4.30 గంటలకు ఆలయ ప్రధాన రాజగోపురం వద్ద ఉట్ల సంబరం వేడుకగా నిర్వహిస్తారు.

డోలీమోతపై స్పందించిన జిల్లా వైద్యశాఖ

▸ పరిస్థితిపై వైద్యాధికారిణి నుంచి నివేదిక ▸ ఆంధ్రజ్యోతి ఎఫెక్టు

అనంతగిరి, ఆగస్టు 26: మండలంలోని కొత్తూరు పంచాయతీ బూసిపాడు గ్రామానికి చెందిన కేరంగి చిన్నమ్మి అనారోగ్యం కారణంగా డోలీమోతపై కుటుంబ సభ్యులు తరలించారు. సోమవారం 'తప్పని డోలీమోత' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జిల్లావైద్యాశాఖ అధికారి జమాల్‌బాషా స్పందించారు. దీనిపై వివరణ ఇవ్వాలని అనంతగిరి పీహెచ్‌సీ వైద్యులను ఆదేశించారు. చిన్నమ్మి అనారోగ్యం కారణంగా తరలించడం వాస్తవమేనని, గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో డోలీమోతపై తరలించారని వైదులు జ్ఞానేశ్వరి, జాహ్నవి తెలిపారు. గ్రామంలో ప్రతి నెలా సిబ్బందితో కలిసి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆగస్టు నెలలో కూడా వైద్యసేవలు అందించామని డీఎంహెచ్‌వోకు అందజేసిన నివేదికలో పేర్కొన్నారు.

'వీవోఏలకు ఆరు నెలల వేతన బకాయిలు చెల్లించాలి'


రింతాడలో సమావేశమైన వీవోఏల సంఘ నేతలు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 26: వీవోఏలకు ఆరు నెలల వేతన బకాయిలు చెల్లించాలని సంఘం మండల కార్యదర్శి చిలకల రామలింగం అన్నారు. సోమవారం రింతాడలో సంఘం అధ్యక్షురాలు ఎం.పుష్ప ఆధ్వర్యంలో జరిగిన వీవోఏల సమావేశంలో మాట్లాడుతూ వీవోఏలకు వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. అలాగే వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శోభన్‌బాబు, సోమలింగం, చంటమ్మ, సోమరాజు, బొంజబాబు, వీరయ్యదొర, బాలరాజు పాల్గొన్నారు.

సీహెచ్‌డబ్ల్యూల సంఘం జిల్లా నూతన కార్యవర్గం


సీహెచ్‌డబ్ల్యూల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, దాసమ్మ

పాడేరురూరల్, ఆగస్టు 26: కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు(సీహెచ్‌డబ్ల్యూ)ల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికయ్యింది. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీహెచ్‌డబ్ల్యూల జిల్లా స్థాయి విస్తృత సమావేశం జరిగింది. అనంతరం నూతన కార్యవర్గం ఎంపికను నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలుగా పద్మ (జీకేవీధి), కార్యదర్శిగా దాసమ్మ (పాడేరు), కోశాధికారిగా సరస్వతి (పెదబయలు), ఉపాధ్యక్షులుగా శేషు, పార్వతమ్మ, లక్ష్మి, భవాని, సహాయ కార్యదర్శులుగా వరలక్ష్మి, అప్పలమ్మ, నిర్మల, పావనితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా బి.చిన్నయ్యపడాల్‌ను ఎంపిక చేశారు.

మదర్ థెరీసా సేవలు చిరస్మరణీయం


మదర్ థెరీసాకు నివాళి అర్పిస్తున్న వర్తక సంఘం నేతలు

చింతపల్లి, ఆగస్టు 26: మదర్ థెరీసా సేవలు చిరస్మరణీయమని వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మదర్ థెరీసా జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బేతాళుడు మాట్లాడుతూ మదర్ థెరీసా 45 సంవత్సరాలపాటు పేదలు, రోగులకు విశిష్ట సేవలందుకున్నారన్నారు. ఆమె సేవలకు నోబెల్ శాంతి బహుమతి, భారతరత్నను ఆమె పొందారన్నారు. కార్యక్రమంలో చేయూత వారియర్స్ ట్రస్టు చైర్మన్ దూనబోయిన రమణ, వర్తక సంఘం నాయకులు తాటిపాకల రమేశ్, కొమ్మర్తి జోగి, మోదగిరి, శేఖర్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌కు ఘన సన్మానం


సూర్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

పాడేరురూరల్, ఆగస్టు 26: ఉత్తమ సేవా అవార్డును అందుకున్న అసిస్టెంట్ లేబర్ అధికారి పి.సూర్యనారాయణను సోమవారం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో స్థానిక ప్రైవేటు ఎలక్ట్రికల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీత అసిస్టెంట్ లేబర్ అధికారి సూర్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికులకు అందిస్తున్న ఈ శ్రమ్ కార్డులు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో యూవీ.రత్నం, టీవీఎస్.ముకుందరావు, శివరాత్రి శ్రీనివాస్‌కుమార్, సిద్ధినాతి కొండలరావు, ఎస్‌డీ.రవి, శ్రీనివాస్, గిరిపాత్రుడు, రామం, బాలరాజు పాల్గొన్నారు.

60 మంది రైతులకు రాజ్‌మా, వలిసెల విత్తనాలు పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న కృషి విజ్ఞాన్ శాస్త్రవేత్తలు

పెదబయలు, ఆగస్టు 26: నైజర్ రకం వలిసెలతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని కొండెంపూడి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సౌజన్య, కిశోర్ బాబు తెలిపారు. సోమవారం మండలంలో గలగండా పంచాయతీ గలగండా, గసాబు, సిరసపల్లి, కూతంగిపుట్టు, గంపరాయి పంచాయతీ చీడిపుట్టు, లక్ష్మీపేట పంచాయతీ కోందువలస గ్రామాలకు చెందిన 60 మంది రైతులకు మేలైన రాజ్‌మా, వలిసెల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర పంటలైన రాజ్‌మా, వలిసెల పంటలను పండించేందుకు రైతుల వద్ద సరైన విత్తనాలు లేక అంతరించిపోతున్నాయన్నారు. ఒక కేజీ నైజర్ విత్తనాలను శుద్ధి చేసి ఒక ఎకరానికి వేస్తే 300 నుంచి 350 కేజీల పంట దిగుబడి వస్తుందన్నారు. బంగారుతీగ వంటి కలుపు మొక్కలు పోవాలంటే 20 లీటర్ల నీటిలో మూడు ప్యాకెట్ల ఉప్పుతో పిచికారీ చేసినట్టయితే కలుపు మొక్కలు నాశనమవుతాయని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వరహాలమ్మ, సర్పంచ్ లోహిథాసు రైతులు పాల్గొన్నారు.

ఫీట్లు కాదు.. పాట్లు



బురదమయంగా మారడంతో మధ్యలో నిలిచిన ఆటో

అనంతగిరి, ఆగస్టు 26: మండలంలోని జీనబాడు పంచాయతీ వాలబు-సరియా మట్టిరోడ్డు వర్షాలకు అస్తవ్యస్తంగా మారింది. ఆయా గ్రామాల ప్రజలు ప్రయాణాలకు అవస్థలు పడుతున్నారు. 2021లో వాలబు-సరియా వరకు రోడ్డును నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టిరోడ్డు బురదమయం అయ్యింది. దీంతో వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. సోమవారం సరియా నుంచి ఓ చిన్నారిని ఆస్పత్రికి ఆటోలోని తరలిస్తుండగా బుదరల్లో కూరుకుపోయింది. దీంతో వారు కాలి నడకన వాలబు చేరుకున్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సరియా, మాకనాపల్లి, గనికే, వాలబు, నగరపాలెం గిరిజనులు కోరుతున్నారు.

చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో షార్టు సర్క్యూట్

▸ బయటకు పరుగులు తీసిన రోగులు

చింతపల్లి, ఆగస్టు 26: స్థానిక ఏరియా ఆస్పత్రిలో షార్టుసర్క్యూట్ వల్ల మెయిన్ బోర్డు కాలిపోయింది. దీంతో వార్డులోకి పొగ రావడంతో రోగులు పరుగులు తీశారు. ఏరియా ఆస్పత్రిలో ఒక వార్డుకి విద్యుత్ సరఫరా కావడం లేదు. దీంతో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతి ఈపీడీసీఎల్ లైన్‌మన్‌కి సమాచారం ఇచ్చారు. దీంతో సోమవారం మధ్యాహ్నం లైన్‌మన్ మూర్తి, మరో ఎలక్ట్రీషియన్ గుల్లెలి లక్ష్మణ్ ఆస్పత్రి మెయిన్ బోర్డు వద్ద మరమ్మతులు చేస్తున్నారు. ఆస్పత్రిలో సుమారు 20ఏళ్ల క్రితం నాటి వైరింగ్ కావడంతో ఒక్కసారిగా షార్టుసర్క్యూట్ జరిగి మెయిన్ బోర్డు పెద్ద శబ్దంతో పేలిపోయింది. దీంతో ఎలక్ట్రీషియన్ లక్ష్మణ్ చేతులు కాలిపోయాయి. వైర్లు కాలిపోవడంతో పొగ వార్డుల్లోకి వ్యాప్తి చెందింది. దీంతో వార్డులోనున్న రోగులు బయటకు పరుగులు తీశారు. ప్రస్తుతం ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఈపీడీసీఎల్ లైన్‌మన్, ఎలక్ట్రీషియన్లు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు మరమ్మతులు చేస్తున్నారు.


కాలిపోయిన మెయిన్ బోర్డు


కాలిపోయిన ఎలక్ట్రీషియన్ లక్ష్మణ్

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


పాడేరు ఉమానీలకంఠేశ్వర ఆలయంలో కృష్ణాష్టమి సందడి


చింతపల్లి పెదపైపు వీధిలో ఆకట్టుకున్న చిన్నికృష్ణుడు, గోపికలు

పాడేరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణం నడిబొడ్డున ఉన్న ఉమానీలకంఠేశ్వర ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను ప్రత్యేకంగా జరిపారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు శ్రీకృష్ణుడు, సత్యభామల వేషధారణలు, వారి నృత్య ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ముసునూరి సుమేధశ్రీ అనే చిన్నారి చేసిన నృత్యం అబ్బురపరిచింది. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కొండలరావు, టీడీపీ నాయకుడు పాండురంగస్వామి, ఆధ్యాత్మిక భక్త బృందం ప్రతినిధులు వీవీ.రత్నం, సత్యనారాయణ, డి.బాబూరావు, రాజబాబు, ముకుందరావు, కొండలరావు, కె.రామారావు, భక్తులు పాల్గొన్నారు.

చింతపల్లిలో... మండలంలో కృష్ణాష్టమి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని మండల కేంద్రం పెదపైపు, రామాలయం, విజ్ఞాన భారతి పాఠశాల, తాజంగి బీటాలైన్‌లో వేడుకలు జరిగాయి. ఉదయం రాధాకృష్ణ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. ఉట్టి కొట్టేందుకు యువకులు ఉత్సాహంగా పోటీపడ్డారు. ఈసందర్భంగా పెదపైపు వీధిలో బాలబాలికలు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ కమిటీ సభ్యులు పసుపులేటి వినాయకరావు, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, జీసీసీ ఉద్యోగుల సంఘ నాయకుడు హేమంత్ పాల్గొన్నారు.

సీలేరులో.. స్థానిక డీఏవీ పాఠశాల, ధారకొండల్లో శ్రీకృష్ణష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం డీఏవీ పాఠశాలలో ఉట్టికొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శివమ్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సంప్రదాయాలు, పండగలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికులకు రూ.26 వేలు చెల్లించాలి

▸ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు

అరకులోయ, ఆగస్టు 26: అరకులోయ, అనంతగిరి మండలాల్లో ఆరేళ్లుగా రైల్వే కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్న కార్మికులకు రూ.26 వేలు వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఏపీ గిరిజన సంఘం ఆఫీస్‌లో రెండు మండలాల పరిధిలో పనిచేసే కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టపరంగా కార్మికులకు కనీస వేతన రూ.26 వేలు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కాంట్రాక్టర్లు మారినా కార్మికులను కొనసాగించాలన్నారు. ఈ విషయమై రైల్వే ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. సీఐటీయూ మండల నాయకుడు సన్యాసిరావు మాట్లాడుతూ.. రైల్వే కాంట్రాక్టు కార్మికులకు రూ.26 వేలు వేతనంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల కన్వీనర్ జానీ, భగత్‌రాం, రైల్వే కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు

కరిముఖిపుట్టు రోడ్డు మరమ్మతు చేపట్టరూ !

ముంచంగిపుట్టు, ఆగస్టు 26: మండల కేంద్రం నుంచి కుమడ వెళ్లే మార్గం మధ్యలోని కరిముఖిపుట్టు సమీపంలో ప్రధాన రహదారి దెబ్బతిన్నది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారిపై పలుచోట్ల గోతులు ఏర్పడడంతోపాటు ఇరువైపుల అంచులు కోతకు గురయ్యాయి. చిన్నపాటి చినుకు పడితే చాలు రహదారిపై పడిన గోతుల్లో వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు ఈ మార్గంపై నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి రహదారి మరమ్మతులకు గురైనా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో పలు విమర్శలకు తావిస్తున్నది. వాహనాలు త్వరగతిన మరమ్మతులకు గురవుతున్నాయని చోదకులు వాపోయారు. అధికారులు స్పందించి రహదారి మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



కరిముఖిపుట్టు సమీపంలో రహదారిపై ఏర్పడిన గొయ్యి

ఆర్.దొడ్డవరంలో సబ్ డీర్ డిపో ఏర్పాటు చేయండి


సబ్‌డిపో ఏర్పాటుచేయాలని కోరుతున్న గిరిజనులు

కొయ్యూరు, ఆగస్టు 26: మండలంలో మంప పంచాయతీకి చెందిన గంగవరం, టీటురాళ్లు, ఆర్.దొడ్డవరం, గొడుగులమ్మబంద గ్రామాలకు నిత్యావసర సరకులు తీసుకునేందుకు వీలుగా ఆర్. దొడ్డవరంలో సబ్ డీఆర్‌డిపో ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ నాలుగు గ్రామాలలో 100కు పైబడి రేషన్ కార్డులు ఉన్నాయి. వీరు ప్రతి నెలా రేషన్ బియ్యం పొందేందుకు అడ్డతీగల మండలం వెదురునగరం మీదుగా 50 కిలోమీటర్లు ప్రయాణించి మంప చేరుకుని రేషన్ సరకులు తీసుకెళుతున్నారు. లేదా కొండల మీదుగా కాలిబాటన 12 కిలోమీటర్లు నడిచి డీఆర్ డిపోకు చేరుకుని సరకులు తీసుకుంటున్నారు. ఇలా ప్రతి నెలా ఉచిత రేషన్ తీసుకునేందుకు వీరికి ప్రయాస తప్పడం లేదు. ఈ నాలుగు గ్రామాల రేషన్ కార్డు లబ్ధిదారుల కోసం ఆర్. దొడ్డవరంలో సబ్ డీఆర్‌డిపో ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల లబ్ధిదారులు కోరుతున్నారు.

ముంచంగిపుట్టులో రాత్రి గస్తీ


ముంచంగిపుట్టులో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు, ఆగస్టు 26: మండల కేంద్రంలో పోలీసులు రాత్రి గస్తీ నిర్వహిస్తున్నారు. గత కొద్ది రోజులుగా మండలంలో పలుచోట్ల చోరీలు జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు రాత్రి గస్తీ నిర్వహిస్తున్నారు. మండల కేంద్రం మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. అనుమానాస్పదంగా ఉన్నవారిని విచారించి విడిచి పెడుతున్నారు. రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తులు గానీ, అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ రవీంద్ర కోరారు.

మత్స్యగుండం.. అభివృద్ధికి దూరం

... 5వ పేజీ తరువాయి

ప్రభుత్వం మత్స్యగుండం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పనులు

మత్స్యగుండం అభివృద్ధికి అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని గుర్తించిన స్థానిక పెద్దలు, గ్రామాభివృద్ధికి ఒక కమిటీని ఏర్పాటు చేసుకుని మత్స్యగుండంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తమర్బ అప్పారావు అధ్యక్షతన గ్రామాభివృద్ధి కమిటీ ప్రత్యేక చొరవతో దాతల సహకారంతో మత్స్యగుండంలో సింహద్వారం, కేశఖండనశాల, కమిటీ కార్యాలయ భవనం, ఆలయానికి అవసరమైన పలు మెరుగులు దిద్దారు. అలాగే ప్రతి ఏడాది శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన అనేక కార్యక్రమాలు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలోనే చేపడుతున్నారు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే మత్స్యగుండం మన్యంలో చక్కని పర్యాటక పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతుందని స్థానికులు, పర్యాటకులు, భక్తులు అభిప్రాయపడుతున్నారు.

రాజ్‌మా సాగుకు ఇదే అదను

... 5వ పేజీ తరువాయి

పాటిస్తూ నాటుకోవాలి.

పోషక యాజమాన్యం

ఏజెన్సీ ప్రాంతంలో పశువుల గెత్తం అధికంగా లభిస్తోంది. పశువుల గెత్తం అధికంగా వేసుకోవడం వల్ల రసాయన ఎరువులు తగ్గించుకోవచ్చు. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 కేజీల నత్రజని, 24 కిలోల భాస్వరం, 8 కేజీల పొటాష్ ఎరువులు వేసుకోవాలి. పంట పూత సమయంలో ఎకరానికి 20 కేజీల యూరియాను నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు వేసుకోవాలి.

నీటి యాజమాన్యం

ఏజెన్సీలో రైతులు వర్షాధారంగా రాజ్‌మాను సాగు చేస్తున్నారు. ఈ పంట మొక్కల వేర్లు భూమిలో పైపైన వుండడం వల్ల అధిక తేమను తట్టుకోలేదు. నీటిపారుదల సౌకర్యం గల నేలల్లో పూత దశకు ముందు నీరు పెట్టడం వలన మంచి పూత వస్తోంది. రాజ్‌మా అధిక నీటిని తట్టుకోలేదు. పొలాల్లో వర్షపునీరు నిలువ వుండకుండా ఏర్పాటు చేసుకోవాలి.

మొలకెత్తే శాతం పరీక్షలు చేసి విత్తనాలు పంపిణీ



రైతులకు పంపిణీ చేసే విత్తనాలకు మొలకెత్తే శాతం పరీక్షలు చేసి పంపిణీ చేస్తాం. ప్రస్తుతం జర్మినేషన్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. రైతులకు పంపిణీ చేస్తున్న విత్తనాలు 80శాతం మొలకెత్తాలి. ఈఏపీ సీడ్స్ నుంచి విత్తనాలను ఆర్‌బీకేలకు తరలిస్తున్నాం. ఒక్కొక్క రైతుకు ఎకరానికి సరిపడే 20 కిలోల విత్తనం పంపిణీ చేస్తాం. పది కిలో ధర రూ.1,510 కాగా రాయితీ పోను రైతు రూ.151 చెల్లించాలి.

- కంటా జాహ్నవి, ఏడీఏ, చింతపల్లి

అతిసార బాధితులకు సత్వర వైద్యం

... 5వ పేజీ తరువాయి

సందర్శించారు. గ్రామంలో వీధులు, గృహ పరిసరాలలో బ్లీచింగ్ చల్లించారు. స్థానిక గిరిజనులు తాగుతున్న గ్రావిటీ పథకానికి క్లోరినేషన్ చేశారు. గ్రామంలో అతిసారతో బాధపడుతున్న నలుగురు గిరిజనులతోపాటు మరో నలుగురు జ్వర బాధితులకు వైద్యం చేశారు. రోగులకు సెలైన్లు పెట్టి మందులు అందజేశారు. ప్రస్తుతం గ్రామంలో అతిసార అదుపులో ఉన్నదని, మరో రెండు రోజులు వైద్యశిబిరాన్ని కొనసాగిస్తామని వైద్యాధికారి భవాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో స్వామి, హెచ్‌వీ లక్ష్మి, హెచ్ఎస్ వెంకటేశ్వర్లు, పారామెడికల్ ఉద్యోగులు రమణ, దేవునాయుడు, నాగరత్నం, జయలక్ష్మి, పోలమ్మ, సర్పంచ్ పేట్ల రాజుబాబు, ఎంఈవో-2 బోడం నాయుడు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

15న దండకారణ్య ఉద్యోగ సమితి కార్యవర్గం ఎన్నిక

పాడేరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర కమిటీ ఎన్నికను సెప్టెంబరు 15న నిర్వహిస్తామని సమితి రాష్ట్ర సలహాదారు డాక్టర్ చెండా కేశవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 15 నాటికి ప్రస్తుతం ఉన్న దండకారణ్య ఉద్యోగ సమితి కార్యవర్గం రెండేళ్ల కాలపరిమితి ముగుస్తుందున నూతన కమిటీ ఎన్నిక చేపడతామన్నారు.

3న సీహెచ్‌డబ్ల్యూల సమస్యలపై ధర్నాలు

పాడేరురూరల్, ఆగస్టు 26: సీహెచ్‌డబ్ల్యూల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబరు 3వ తేదీన ప్రతీ పీహెచ్‌సీ వద్ద చేపట్టనున్న ధర్నాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, దాసమ్మ పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తలతో సమానంగా సీహెచ్‌డబ్ల్యూలకు వేతనాలు చెల్లించాలని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో ధర్నాలు, నిరసనలు చేపట్టామన్నారు. అయినప్పటికి వైసీపీ ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి సమస్యలపై వినతిపత్రం అందించామన్నారు. కూటమి ప్రభుత్వం అయినా తమ సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే పోరాటం తప్ప మరో మార్గం లేదని వారు స్పష్టం చేశారు.

31న సీపీఐ జిల్లా సమావేశం

చింతపల్లి, ఆగస్టు 26: మండల కేంద్రంలో సీపీఐ జిల్లా సర్వసభ్య సమావేశం ఈనెల 31 తేదీన నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు పొట్టిక సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీపీఐ బలోపేతానికి పార్టీ నాయకులు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించారన్నారు. ఈమేరకు చింతపల్లిలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరుకానున్నారన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గిరిజనులు సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు పేట్ల పోతురాజు పాల్గొన్నారు.

ఏపీ జెన్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బదిలీ

సీలేరు, ఆగస్టు 26: స్థానిక ఏపీ జెన్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్ ఓఅండ్‌ఎం) జి. ప్రభాకరరావు పోలవరం ప్రాజెక్టుకి బదిలీ చేస్తూ మేనేజింగ్ డైరెక్టర్ చక్రధరబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో జెన్‌కో కేంద్ర కార్యాలయంలో డీఈఈగా పేనిచేస్తున్న గంటా భాస్కరరావుకి పదోన్నతి కల్పిస్తూ సీలేరు ఈఈగా బదిలీ చేశారు.

మృతి చెందిన పశువును తరలించండి

అనంతగిరి, ఆగస్టు 26: మండల కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయం రోడ్డును ఆనుకుని నివాస గృహాల సమీపంలో ఓ ఇంటిలో అనారోగ్యంతో పశువు మృతి చెందింది. మూడు రోజులైనా ఆ పశువును తరలించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పంచాయతీ అధికారులు స్పందించి, ఆవును పాతి పెట్టేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పాడేరు ఎస్సీ సెల్ అధ్యక్షుడికి మంత్రి లోకేశ్ అభినందనలు


రాముకు ప్రశంసాపత్రం అందజేస్తున్న గిడ్డి ఈశ్వరి

సీలేరు, ఆగస్టు 26: తెలుగుదేశం పార్టీ సమాచారాన్ని యాప్ ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లిన పాడేరు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాము సేవలను మంత్రి లోకేశ్ అభినందించారు. ఈ మేరకు రాముకు ప్రశంసాపత్రాన్ని సోమవారం టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అందజేశారు. టీడీపీ యాప్ వినియోగంలో అయనకు టాప్ స్కోర్ రావడంతో లోకేశ్ అభినందించారు. ఈసందర్భంగా రాము మాట్లాడుతూ పార్టీలో పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయండి

▸ వంట్లమామిడి గిరిజనుల వేడుకోలు

అనంతగిరి, ఆగస్టు 26: మండలంలోని పినకోట పంచాయతీ వంట్లమామిడిలో గిరిజనులు కర్రలనే విద్యుత్ స్తంభాలుగా నిలబెట్టుకున్నారు. వర్షకాలం కావడంతో ఈదురు గాలులకు ఈ కర్రలు విరిగిపోతాయని గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేయాలని పలుమార్లు విద్యుత్ శాఖాధికారులకు విన్నమించినా ఫలితం లేకపోయిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

నేడు రాజ్‌మా విత్తనాలు పంపిణీ

గూడెంకొత్తవీధి, ఆగస్టు 26: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రాయితీ రాజ్‌మా విత్తనాలు మంగళవారం పంపిణీ చేయనున్నట్టు వ్యవసాయాధికారి మధుసూదనరావు తెలిపారు. వ్యవసాయ కార్యాలయంలో రాజ్‌మా విత్తనాలు 90 శాతం రాయితీతో ఒక్కొక్క రైతుకి 20 కిలోలు చొప్పున పంపిణీ చేస్తామన్నారు.

చిన్నారులను పరామర్శించిన ఏయూ అసోసియేట్ ప్రొఫెసర్

గూడెంకొత్తవీధి, ఆగస్టు 26: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కైలాసపట్నం బాధితులను ఆంధ్ర విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ పసుపులేటి లక్ష్మణరావు పరామర్శించారు. సోమవారం కేజీహెచ్‌కి వెళ్లిన ఆయన చిన్నారులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కలుషిత ఆహారంతో ముగ్గురు విద్యార్థుల మృతి, పదుల సంఖ్యలో బాలబాలికలు అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు విద్యాభ్యాసం కోసం ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో చేరాలన్నారు. ట్రస్టుల వన గృహాలకు తల్లిదండ్రులు పిల్లలను పంపించరాదన్నారు.

గరిగుడ్డిలో సామాజిక మరుగుదొడ్లు ప్రారంభం

అనంతగిరి, ఆగస్టు 26: మండలంలోని కొండిబ పంచాయతీ గరిగుడ్డిలో పాస్టర్ తెలగంజి సాల్మన్ ఆధ్వర్యంలోని జేసీఐ వైజాగ్, డబ్ల్యూసీ స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లను సోమవారం ప్రారంభించారు. గిరిజనులు మరుగుదొడ్లను ఉపయోగించుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సంస్థ ప్రతినిధులు జేపీ సురేశ్, కేవీ రావు, సాయి సుధీర్, సుజాతసాల్మన్ కోరారు.